# దారి తప్పిన మనిషి

మూర్తి వ్యాపారరీత్యా ఒంటిగా కారులో నూరుమైళ్ళ దూరంలోనున్న పట్నంకి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. నిన్న వెళ్ళినప్పుడు తన ఆలోచనలలో వ్యాపారం, లాభాలు, కొత్త పరిశ్రమలు, పన్నులు తగ్గించుకునే ఉపాయాలు, క్రొత్త కారు- ఇలాంటి ఆలోచనలతో నిండి, దారి తప్పకుండా ఆ పట్నం చేరుకున్నాడు.

ఈవేళ తిరిగి వస్తూనే ఉదయం జరిగిన సంఘటన గురించి దీర్ఘాలోచనలో పడ్డాడు. తన తండ్రికి ఆప్తుడైన వ్యక్తి తనను ఉదయమే ఒక దేవాలయానికి తీసుకువెళ్ళారు. తనకు స్వతహాగా గుడులు, గోపురాలు అంటే ఆసక్తి లేదు. దేవుడూ, దెయ్యాలూ అంటే నమ్మకం లేదు. కనపడని, నిరూపించలేని సత్యాల కోసం పరితపించి యీ మానవ జన్మలో పొందవలసిన ప్రాపంచిక సౌఖ్యాలు విడిచి పెట్టుకోవడమంత తెలివి తక్కువ తనం యింకొకటి లేదని తను నిర్ధారించుకున్నాడు. తన తండ్రి రోజుకొకసారే తిని, చౌకరకం బట్టలు కట్టి ఒక చిన్న యింట్లో ఉండేవాడు. సుఖపడటానికి ఉన్న అవకాశాలన్నీ జారవిడుచుకున్నాడు. తనే కాకుండా తన కొడుకు కూడా తను బ్రతికుండగా తనలానే కట్టు దిట్టంగా వుండాలనేవాడు. ఎవరి జోళ్ళకు వారే పాలిష్ వేసుకుంటేనేగానీ

అతనికి శాంతి వుండేది కాదు. లాభాలలో సగందాకా దానాలకే పోసేవాడు. అలాంటి తండ్రి అగపడని సత్యాలకోసం వెదకి వెదకి సత్యమిది అని వూహేగానీ నిరూపించుకోలేని పరిస్థితిలో పోయాడు. ఒక యేడాది తిరక్కుండానే లోకం అతనిని మరచిపోయింది. అందుకే తనకు తండ్రి గతించాక పెద్దరికం రాగానే ప్రజల ముఖప్రీతి మాటలను వినలేదు. అతను చేస్తున్న దానాలను ఆపివేశాడు. లాభాలతో వ్యాపారం త్వరితంగా వృద్ధిచేశాడు. తను, భార్యాపిల్లలూ యిప్పుడే కాక కొన్ని తరాలవరకు వెతుక్కునే అవసరం లేకుండా చేయటానికి తాపత్రయ పడ్తున్నాడు. స్వసుఖాలకు మరిగిన మనసు ఆ సుఖంకోసం డబ్బు వెచ్చించ టానికి వెనుదీయలేదు. కండపుష్టి తిండితోనేకాదు సుఖాలతోనూ కలిగింది.

ఇలాంటి మూర్తి యీ రోజు ఆ పట్నం దేవాలయ ప్రాంగణంలో తన తండ్రి శిలాప్రతిమను చూశాడు. తండ్రి బ్రతికుండగా యిది ప్రతిష్ఠించడం జరగలేదని తనకు తెలుసు. అలా చెయ్యడానికి తన తండ్రి ఒప్పుకునేవాడు కాదు. ఆ శిలాప్రతిమ చుట్టూ చిన్న వుద్యానవనం వుంది. కొందరు భక్తితో ఆ బొమ్మను చూస్తూ తలవంచటం చూసాడు.

"ఎప్పుడు దీనిని ప్రతిష్ఠించా"రని అడిగాడు.

"ఈ మధ్యనే...."

తన తండ్రి శిలాప్రతిమ ప్రతిష్ఠించేటప్పుడు కనీసం ఆయన యేకైక పుత్రుడ్ని పిలవాలనే మర్యాదనైనా యీ పట్నవాసులు పాటించలేదని మూర్తి మనసు బాధపడింది. తనను అక్కడకు తెచ్చిన తండ్రి మిత్రుడు ఆ విగ్రహానికి ఒక నమస్కారం చేస్తూ-

"దారితప్పని మహానుభావుడు" అన్నాడు.

తిరిగి కారులో వస్తూ మూర్తి మనసులో ఇదే తిరగజొచ్చింది. మనుషులకు ఒక దారి వుంటుందనీ ఆ మార్గం గుండాపోతూ యెక్కడో గతించినా మళ్ళీ ఆ గతించిన చోటులో వచ్చే జన్మలో వుద్భవిస్తాడని, మళ్ళీ ముందుకు సాగి పోతాడనీ, చివరకు గమ్యమైన పరమాత్మను చేరుకుంటాడనీ, -జన్మ జన్మానికి తప్పులను తగ్గించుకుని ఒప్పులను పెంచుకొని ఒప్పులకుప్పయైన భగవానుని చేరుకోవటమే మానవుని ధ్యేయమని - ఇలా యెక్కడో యెవరో అనగా విని ఇదివరకు నవ్వుకున్నాడు మతం మనిషికి నల్లమందు వంటిదని యెవరో అన్న దాంట్లో నిజముందని,దాని జోలికి తను పోలేదు. మతం ప్రాతిపదికంగా మనిషి మార్గాలన్నీ సృష్టించబడ్డాయి. దేవుని ప్రమేయం లేకుండా యే మతమూ లేదు. దేవుని రూపులో భయమూ భక్తీ రెండూ వున్నాయ్.రెండూ మానవుని ప్రాపంచిక సౌఖ్యాలకు శత్రువులు.పాపంచెయ్యని మనిషి ప్రాపంచిక సుఖాలను పొందలేదు.

కారు మెల్లగా డ్రైవ్ చేస్తూనే ఇంకో సిగరెట్ ముట్టించాడు. ఆలోచనలూ కాలుతున్న సిగరెట్ లానే ఆరిపోకుండా పోతున్నాయ్. తన తండ్రి మిత్రుడు ఆ దేవాలయంలోనికే తీసుకు వెళ్ళి ఆ మాటలు అని తండ్రీ కొడుకులకు ఉన్న భేదాలు యెత్తి పొడిచాడు. డబ్బూ, తాగుడూ, స్త్రీ ఈ మూడు తప్పించి మనిషికి ఇంకేమీ సుఖమీయలేవు. తెలివి తక్కువ వాళ్ళే పుష్కలంగా నీరు లభించేటప్పుడు యెండమావుల వెంట దాహం తీర్చుకోడానికి పరుగెత్తుతారు. పచ్చని ఆకులు ఉండగా యెండుటాకులు పట్టుకొని గతించిన పచ్చదనం చూడ టానికి ప్రాకులాడుతారీ భక్తులూ వేదాంతులూను. నేడు పడిన సుఖమే నిజం, రేపటి సుఖం ఊహ! రేపటి ఊహాలో పడి ఈ రోజున సుఖాన్నెవరు ఖూనీ చేసుకోమన్నారు? నేడు సుఖపడుతున్న వాళ్ళే నిజంగా దారి తప్పని వాళ్ళని సిగరెట్ పీకను విసిరేశాడు.

ఆ ఆలోచనా తరంగాలలో చిక్కుకుని యింతవరకూ తను దారి తప్పానని పోల్చుకోలేదు. మనుష్య సంచారం మృగ్యమైన ఒక ఘాట్ పై కారు పోతుండగా తను దారితప్పానని గుర్తుకు వచ్చింది. ఒక అరణ్య మార్గంలో పోతున్నానని ఆ జూలుచెట్లు, చెట్లపై కోతులే చెపుతున్నాయి. ఘాట్ పైకి పోయి కారు త్రిప్పుదామని ఆపాడు. ఓసారి కారు దిగాడు.

ప్రకృతి యెండలో వెలిగిపోతుంది. చుట్టూ కలియజూస్తే ప్రకృతి ఆకాశాన్ని గొడుగుగా వేసుకున్నట్లుంది. దూరానకొండలు మండిపోతూ దినకరుని చీల్చి మింగాలని భల్లూకాల్లా ఎదురు చూస్తున్నాయ్. ఆ రక్తంతో సింగారించ టానికి తెల్లని మబ్బులని ఆహ్వానిస్తున్నాయ్. ఎండమావులు వేడిని భరించలేక యేటి ఒడ్డుకు పరుగులెత్తున్నాయ్. గాలికి గులాబి వనంలో రెక్కల వర్షం కురుస్తోంది. కమలాలు క్రిందికి రాలుతున్నాయ్. అతను కొద్ది క్షణాలు ఈ ప్రకృతి పచ్చని ఊయలలో ఊగాడు.

విరబూసిన గులాబీలను తెంపి ముందు సీటులో కుప్పగా వేసాడు. కమలాపండ్లను యేరి వెనుక సీటులో వుంచాడు. ఇంతలో చెట్లపై నున్న కోతుల కోలాహలం వినిపించింది. అంత దూరాన ఒక లేడిపిల్ల గెంతులేస్తూ పోతుంది. పెద్ద పాము తన యెదరగానున్న చెట్టుమీద నుంచి దిగుతోంది. ఇలా తను వస్తానని తెలుసుంటే తుపాకి తెచ్చేవాడే! రాళ్ళను ఆ పాముమీద రువ్వాడు. ఇంకోరాయి రువ్వగానే ఆ పాము డొంకలలోకి దిగిపోయింది.

తిరిగి పోదామని కారు స్టార్టు చెయ్యబోతుండగా అద్దంగుండా వెనుక నుంచి యెవరో వస్తున్నట్లు చూశాడు. ఎర్రరంగు చీర కనుపిస్తోంది. రానురాను దగ్గరై గబగబా నడుస్తోంది. ఒకసారి తనవేపు చూసి మళ్ళీ ముందుకు సాగి

పోయింది. ఆ చూపుతో కళ్ళాలు వేసింది. యౌవనం అంతా ఆమె శరీరాన్ని వుప్పొంగించి ఓ కన్నె లేడిలా కదిలి పోతోంది. ముసుగులేని నగ్న ప్రకృతిలా ఆ జాకెట్టులేని జవ్వని అగుపించింది. సంపెంగ మొగ్గలాంటి ముక్కు, గులాబిల్లాంటి శరీరచ్ఛాయ, మందారాల్లాంటి పెదిమలతో నున్న ఆడవాళ్ళను ఇదివరకు చూశాడు. అనుభవించాడు, కాని ఈ మెది లేడిలాంటి నిగనిగలాడే శరీరచ్ఛాయ. పొంగిన బుగ్గలు ముక్కును లోనికి త్రోశాయ్. మూతి చిన్నదైనా ముద్దుగా వుంది. ఫాల భాగంలో తిన్నగా ఒక ముడుత అగుపించింది.

తన జీవితంలో అదృష్టం అనేది ధనార్జన లోను, స్త్రీ సౌఖ్యాలలోనూ, యిదివరకూ వెతుక్కొని వచ్చిందనుకొని. .. మెల్లగా కారు ముందుకే నడిపాడు.

వెనుక చూపు లేకుండా ఆమె గబగబా సాగిపోతోంది. కారు అద్దంలో నుంచి కనిపిస్తున్న కొండ శిఖరాలు కదులుతూ అవి యెంతో చేరువలో వున్నట్లు న్నాయ్. కొండల్లో నుంచి గలగలా శబ్దంతో జారుతున్న సెలయేర్లు తనలోనూ అలాంటి శబ్దాలతో పులకరించాయ్ అడవిలో తేనెపట్లు, గులాబులు, తియ్యని కమలాలూ అన్నీ తన చుట్టూ కదలుతున్నాయ్. కారుతోపాటు అతని పొంగిన నరాలూ పరువెత్తసాగాయ్.

ఆమె దగ్గరగా తీసుకువెళ్ళి కారునాపి, "దిగబెట్టనా?" అన్నాడు.

"చాలా దూరం బాబు - సాయంకాలానికిగానీ చేరుకోలేను."

"ఫరవాలేదు. కారులోనైతే వేగంగా వెళ్ళిపోతావు."

"చాలా మంచి బాబులా వున్నావ్. నా ఆతృత అలాంటిది. నేను చెప్పిన దగ్గర ఆపు బాబూ!" అంది.

మాట్లాడకుండా ముందు తలుపు తెరిచాడు ఆమె కూర్చుంది తలుపు వెయ్యటానికి అటు వేపు వంగుతూ అతని భుజాన్ని ఆమె కొకసారి తగిలించాడు. ఇద్దరికీ మధ్యనున్న గులాబీలు కాస్త నలిగిపోయాయ్. సిగరెట్ ముట్టించి మళ్ళీ కారు ముందుకు పోనిచ్చాడు.

"ఎందాక వెళ్తున్నావ్... ?"

"అ కొండలు కనిపిస్తున్నాయే.... అ వెనక మా వూరుంది."

"ఎక్కడ నుంచి వస్తున్నావ్....?"

"ఆ ఘాటీ క్రింద మా కన్నవారి వూరు.... పొలంలో నున్నాను. నా మొగుడికి పెద్ద జబ్బు చేసిందని కబురొచ్చింది. ఎకాయెకిగా బయలుదేరాను."

"మీ వాళ్ళెవరూ తోడు రాలేదేం?"

"మా అయ్య ముసిలోడు. ఐనా. యీ త్రోవంట భయం లేదు బాబూ!"

"అడవి కదా...........!"

"ఈ చిరుత పులులు, జంతువులూ వాటినేమైనా అంటేనే మీదపడ్తాయ్. లేకపోతే యేమీ చెయ్యవు బాబూ!"

"పెళ్ళయి యెన్నాళ్ళయింది?"

"ఆరు నెలలు నిండలేదు బాబూ! మాయదారి జబ్బు యెక్కడుందో?"

"ఫరవాలేదులే తగ్గిపోతుంది."

"మంచి బాబువి, నీ నోటిమాట జరుగుతుంది."

తను తిరిగి పోవడానికి పెట్రోలు సరిపడదనే అనుమానం కారు వేగాన్ని తగ్గించి, ఇనుప దిమ్మ దగ్గరగా నున్న అయస్కాంతపు ఆకర్షణను తిరస్కరించలేక పోతోంది. రోడ్డు ప్రక్కనే ఒక చెరువు అగపడింది. కారు ఆపాడు.

"అదిగో నీరు - నాకు ఆకలౌతోంది.... నువ్వు యెప్పుడు తిన్నావో యేమిటో.... రా- తిని.... బయలుదేరుదాం."

"నాకు ఆకలి చచ్చిపోయింది బాబూ! ఆతృతగా వుంది. వేగంగా తినేసి రండి."

"అయితే, నేను తినను" అన్నాడు.

"నా నుంచి మీ కెందుకు బాధ? పదండి" అంది.

లేచి కారులో నుంచి ఒక బేగ్ తీశాడు.

అప్పుడే ప్రొద్దు పడమటకు తిరిగింది అంతవరకూ ఆ పెద్ద సరస్సుపై పూల మాలలా తిరుగుతున్న చిన్న తెల్లని పక్షుల గుంపులు చెదరిపోయాయ్. సరస్సు దరికి చేరేసరికి తెల్ల కలవలు వణుకుతున్నాయ్. విశాల వటవృక్షం పుంతలతో ఒడ్డుపై ఒక శాలను కట్టింది. అక్కడకు చేరేసరికి ఆకులు రాల సాగాయి. అల్లంత దూరంలో సుడిగాలి రేగి దూళిని పైకి లేవనెత్తింది. తివాసీ ఆ వటశాల దగ్గర పరిచాడు.

కేరియర్ నుంచి పూరీలు తీసి తినమని ఆమె కివ్వగా, ఆమె అతనినే తినమంది.

"నీవు తింటేగానీ ఒప్పుకోను" అంటూ బలవంతాన ఆమె నోట పెట్టబోయాడు. ఆమె వెనుకకు వంగగా ఆమెను ముట్టుకుంటూ నోటిలో పెట్టాడు. ఆమె సరిగ్గా కూర్చుని తల దించుకుని తింటోంది. మూర్తి ఆమె వేపు క్రీగంటగా చూశాడు. మనసున్న ఆడవాళ్ళు యిలాంటి వేషాలే వేస్తారని తను సిద్ధాంతీకరించుకున్నాడు. యిదంతా లోనున్న ప్రేమను అణచుకోడానికి చేసే ప్రయత్నంలోని నటన. నటించటం చేతకాని ఆడది యెప్పుడూ ప్రేమించలేదని తనకు

తెలుసు. ఆకలి జ్వాలలు ఆరగానే అతనిలో కామజ్వాలలు రేగినయ్. ఆ మంట లలో మనస్సు మండిపోయి రక్తం భుగ భుగ లాడి వురకలు వేసింది. ఆమె నోటిలో బలవంతాన బ్రాంది పొయ్యించింది.

''దాహం పోతుంది. తాగు - తాగు - యేమీకాదు'' అన్నాడు.

తాగని ఆమెచేత బలవంతాన 'తియ్యని సోడా' అని తాగించాడు. ఆమె కొద్ది క్షణాల్లో నవ్వింది. పక పక నవ్వింది. అతను తాగింది ఆమె కంటే ఎక్కువే. ఆమె లేచిపోబోతూంటే ఆమెను గట్టిగా పట్టుకొని కూర్చోబెట్టాడు ఆ మైకంలోనే ఆమె "మంచిబాబు....నీలాంటి బాబులు యీ అడవి వేపు.... యెవరూ....యిప్పటిదాకా రాలేదు....మా మంచి బాబు...." అంది.

ఆమె సగం మైకంతో యేవేవో వాగుతోంది. ఎర్రని చీర గాలికి యెగిరి పక్కన నీటిలోకి పడి కొంతవరకూ తడిసిపోయింది. తడిసిన చీర రంగు నీటిలో వెలిసింది. ఆ నీటిలోని యెరుపు రంగును ప్రొద్దు పీల్చుకొనిపోయింది.

ఆమెకు స్పృహ వచ్చినట్లు అతనికి కొంత సేపటివరకూ తెలియలేదు. ఆమె ఒక్కసారి "అమ్మా!" అనగానే చప్పున లేచి చూశాడు. ఆమె లేచి ముందుకు పరిగెత్తి ఆగిపోయింది. అతను ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమె చూపులు యెక్కుపెట్టిన బాణాల్లా వున్నాయ్. ఆ మరుక్షణంలో ఆమె యేడుస్తోంది. మాట్లాడటానికి కూడా శక్తిలేని మనిషిలా నిల్చున్నాడు. ఆమె కన్నీరు తుడుచుకుంటూ -

"ఒకదారిన పోయేదాన్ని-నన్ను దారి తప్పించేసావ్....నీకు న్యాయమా?" అంది.

మూర్తి ఒకసారి తలెత్తి చూసినా ఆమె ముఖం అతనికి సరిగ్గా కనబడ లేదు.

"నా మొగుడికి నా ముఖం యెలా చూపిస్తాను?"

"నీకూ నాకూ తప్పించి యింకెవ్వరికి తెలీదులే."

''దేముడికి తెలీదా?'' అంది.

మూర్తికి నవ్వు అప్రయత్నంగా వచ్చింది. తను తిరిగివస్తూ తలుచు కున్న తలపులే జ్ఞప్తికి వచ్చాయ్.

"పద, నిన్ను వేగంగా....దిగబెట్టాను....''

మౌనంగా అతని వెంట కదిలింది. కారులోని గులాబీలు వాడిపోయినయ్. వేడి తగ్గిన దినకరునిపై కసి తీర్చుకోడానికి పశ్చిమ కొండలు యెదురు

చూస్తున్నాయి. ప్రకృతి మూగపోయి నట్లుంది. ఆమె వుండి వుడిగి అతని చేతులవేపు చూస్తోంది.

కారు ఒక పెద్ద లోయ ప్రక్కనే ఉన్న సన్నటి బాటగుండా పోతుంది. ఆమె చెప్పున అతనిని ఆప్యాయంగా తాకి అతని భుజంపై ముద్దు పెట్టి "అటు చూడు బాబూ....ఎంత చక్కగా వుంది" అంటూ తూర్పువేపు చూపించింది. అతను చూసి ఆమె ముద్దుపెట్టి చెప్పగా చూశానని సంతోషంతో "వహవ్వా...." అన్నాడు. ఆమె చప్పున బలమంతా ఉపయోగించి కారు స్టీరింగు చక్రాన్ని గిర గిరా తిప్పివేసింది. కారు దారితప్పి కొన్ని వందల అడుగుల లోయలోనికి జారి పడిపోయింది. *

(1983)